ప్రజాశక్తి
శనివారం 21 జూన్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

పేదలకు చేయూతివ్వని పెద్దలు

- హైరానా తప్ప ప్రయోజనం లేదంటున్న యంత్రాంగం
- సిఎం సమక్షంలో ఇచ్చిన హామీల అమలుకు ముందుకురాని ప్రముఖులు
- పొన్నెకల్లులో 101 కుటుంబాలకు సాఫ్ట్‌వేర్ కంపెనీ కాస్తంత కసరత్తు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అత్యంత పేద వర్గాలుగా గుర్తించిన ప్రజలను ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం రూపొందించిన ప్రభుత్వ, ప్రైవేటు, పీపుల్స్, పార్టనర్‌షిప్ (పి-4) విధానం అమలుకు జిల్లాలో అధికారులు నానా హైరానా పడుతున్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. వివిధ రంగాల్లో పేరెన్నికగన్న ప్రముఖులు, వ్యాపార, పారిశ్రామిక వేత్తలు ప్రజలకు తగిన చేయూత నివ్వాలని సిఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపునకు జిల్లాలో ఇప్పటి వరకు తగిన స్పందన రాలేదు. పి-4 సర్వేలో నిరుపేదలుగా గుర్తించిన బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శులను ఎంపిక చేయాలని మండల, గ్రామ స్థాయి అధికారులపై ఉన్నతాధికారులు వత్తిడి తెచ్చారు. కానీ ఇప్పటి వరకు ఏ గ్రామంలోనూ పట్టుమని 10 కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శకుల ఎంపిక జరగలేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఏమాత్రం అనుకూలంగా లేవని మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు తెలిపారు.

పి-4 ప్రారంభం సభ ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి రోజున తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో సిఎం చంద్రబాబు సమక్షంలోనే నిర్వహించారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల ఎదుట పలువురు



పొన్నెకల్లులో స్థానికులతో సమావేశం నిర్వహిస్తున్న పై డేటా కంపెనీ ప్రతినిధులు (ఫైల్)

మార్గదర్శకులను ఎంపిక చేసి గ్రామంలోని 370 కుటుంబాలను ఆదుకునేందుకు లక్ష్యాన్ని నిర్ధేశించారు. గత రెండు నెలల కాలంలో ఇప్పటి వరకు పై డేటా అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ మాత్రమే 101 కుటుంబాలను ఎలా ఆదుకోవాలనే అంశంపై కసరత్తు చేసింది. కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎం.సౌమ్య తమ సిబ్బందితో కలసి పొన్నెకల్లులో పర్యటించి 101 కుటుంబాలకు సాయం ఎలా చేయాలి. వారికి ఎటువంటి శిక్షణ ఇవ్వాలన్న అంశంపై చర్చించారు. కానీ తుది రూపు రాలేదు. ఈ కంపెనీతో పాటు ఇతర వ్యాపార వర్గాలు, జిల్లాలోని ప్రముఖ వైద్యులు మరో 270 కుటుంబాలను ఆదుకునేందుకు సిఎం సమక్షంలో అంగీకారం తెలిపినా ఆ తరువాత పట్టిపట్టనట్టు వ్యవహరించారు. 50 కుటుంబాలను దత్తత తీసుకుంటామని హామీ ఇచ్చిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులెవ్వరూ ముందుకు రావడంలేదు. అయితే జిల్లాలోని ఇతర గ్రామాల్లో మాత్రం ఇప్పటి వరకు మార్గదర్శకుల ఎంపిక జరగలేదు. కొన్ని గ్రామాల్లో జిల్లాలోని ప్రముఖ వ్యాపార వర్గాలు, పారిశ్రామిక వేత్తలు, విద్యా, వైద్య రంగాల్లోని ప్రముఖులను అధికారులు, సచివాలయం ఉద్యోగులు సంప్రదించగా ఆర్థికంగా కొంత విరాళం అయితే ఇవ్వగలం కానీ గ్రామాలకు వెళ్లి పేదలతో కలిసి వారికి శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించడం వంటివి తమ వల్ల కాదని అధికారులకు తేల్చి చెప్పడంతో అధికార యంత్రాంగం కూడా మిన్నకుండిపోయింది.

ఏడాదైనా ఎక్కడి సమస్యలక్కడే

- ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి

ప్రజాశక్తి-గుంటూరు



విలేకర్లతో మాట్లాడుతున్న నేతాజి

టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనకు ఏడావవుతున్న సందర్భంగా అన్ని హామీలు అమలు చేశామని చెప్పుకుంటున్న ప్రభుత్వం అనేక హామీలను విస్మరించిందన్నారు. సూపర్-6 పూర్తి స్థాయిలో అమలు చేయలేదని, ఇళ్ల స్థలాలు, జిల్లాలో అనేక సమస్యలు ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని చెప్పారు. పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టించి ఇస్తామని చెప్పి ఇంత వరకూ ఆ ప్రక్రియ చేపట్టలేదన్నారు. జిల్లాలో దాదాపు లక్ష మందికి ఇంటి స్థలాలు లేవని, మరో 50వేల మంది ఇంటి పట్టాల కోసం ఎదురు చూస్తున్నారని, ఒక్క మంగళగిరి నియోజకవర్గంలోనే 18 వేల మంది ఉన్నారని, ఇటీవల 3 వేల మందికి ఇచ్చి సరిపెట్టారని వివరించారు. నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1500లు వంటి హామీల ఊసే లేదన్నారు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్లకు సంబంధించి మొదటి విడత సబ్సిడీ మాత్రమే ఇచ్చారని, అది కూడా సాంకేతిక కారణాలతో అనేక మందికి దక్కలేదని, రెండో సబ్సిడీ సిలిండర్ నగదు ఇంత వరకూ లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. టిడ్కో గృహ సముదాయాల్లో పెద్ద ఎత్తున మౌలిక వసతుల సమస్యలున్నాయన్నారు. తాగునీరు, మురుగు కాల్వలు, పారిశుధ్యం నిర్వహణ వంటి సమస్యలు వెంటాడుతున్నాయన్నారు. టిడ్కో గృహ సముదాయలున్న చోట రేషన్, పింఛను పంపిణీ వంటి ప్రభుత్వ సర్వీసులు అందుబాటులోకి రాలేదని చెప్పారు. రాజధాని ప్రాంతంలో ప్లాట్లు అభివృద్ధి చేయాలని, రాజధాని పింఛన్లు పునరుద్ధరించాలని డిమాండ్

▶ 2లో



నిరసనలో పాల్గొన్న వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు

తెనాలిలో వరుస హత్యల కలకలం

- మూడు వారాల్లో ముగ్గురు మహిళలు దారుణ హత్య
- వృద్ధులు, ఒంటరి మహిళలే లక్ష్యంగా బరితెగిస్తున్న దుండగులు

2లో

గుంటూరు, మైదవోలులో..

పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

2లో

నేటి నుండి పాలీసెట్ కౌన్సెలింగ్

ధ్రువపత్రాల పరిశీలినకు గుంటూరు, నర్సరావుపేటలో హెల్ప్‌లైన్ సెంటర్లు - 3న సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి-గుంటూరు

పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం పాలీసెట్ పరీక్ష రాసిన విద్యార్థులకు నేటి నుండి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుంది. ఈనెల 28వ తేదీ వరకూ కొనసాగుతుంది. ఇందుకోసం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రెండు హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లాలో నల్లపాడులోని ఎంబిటిఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజిలో, పల్నాడు జిల్లాలోని నర్సరావుపేటలో జెఎన్‌టియు ఇంజినీరింగ్ కాలేజిలో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు

▶ 2లో

పనిగంటల పెంపుతో మరింత నిరుద్యోగం

కార్మిక వ్యతిరేక నిర్ణయాలు ఉపసంహరించుకోవాలని నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు

పనిగంటలు పెంపు, ఇతర కార్మిక వ్యతిరేక నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 8 గంటల పనివిధానాన్ని 10 గంటలకు పెంచటం, రాత్రివేళ మహిళలతో పని చేయించుకోవటానికి వీలు కల్పిస్తూ చేసిన నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక శంకర్ విలాస్ సెంటర్‌లో శుక్రవారం నిరసన చేపట్టారు. ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణ మూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ, ఎఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కోటయ్య మాట్లాడుతూ నరేంద్ర మోడీ, కార్పొరేట్ల మెప్పు కోసమే చంద్రబాబు ఇలాంటి కార్మిక వ్యతిరేక నిర్ణయాలు చేశారని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని కార్మికులంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కేంద్రం ప్రభుత్వం బాటలోనే చంద్రబాబు ప్రభుత్వం పయనిస్తోందని, కార్మిక హక్కులను హరిస్తోందని అన్నారు. కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లో తెచ్చిందన్నారు. వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం జరుగుతుండటంతో అమలుకు పూనుకోలేదన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌ల అమలులో భాగంగానే పనిగంటల పెంపు, ఇతర నిర్ణయాలు చేయటం అన్యాయన్నారు. సంపద

▶ 2లో

23 నుంచి గుంటూరులో ట్రాఫిక్ మళ్లింపులు

- కంకరగుంట నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా అమరావతి రోడ్డులోకి ప్రవేశం
- పలు మార్గాల్లో రెండేళ్లపాటు కొనసాగనున్న ఆంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో ఈనెల 23 నుంచి శంకర్ విలాస్ బ్రిడ్జి పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలను మళ్లిస్తున్నట్టు జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ శుక్రవారం మీడియాకు తెలిపారు. సోమవారం ఉదయం నుంచి

▶ 2లో



23 నుండి శంకర్ విలాస్ ఆర్‌ఒబి పనులు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

శంకర్ విలాస్ ఆర్‌ఓబి పనులు ఈనెల 23వ తేదీ నుండి ఏసీ కాలేజీ వైపు మొదలు పెట్టనున్న దృష్ట్యా సోమవారం నుండి ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. ఆర్‌ఓబి పనులకు సంబంధించి ఆర్‌అండ్‌బి, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్ట్ సైట్ ఇంజినీర్లు, ట్రాఫిక్ అధికారులతో తన కార్యాలయంలో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ట్రాఫిక్ ఏయే మార్గాల్లో మళ్లిస్తున్నారో పత్రికా ప్రకటన ద్వారా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. మూడు వంతెనల దగ్గర రోడ్డు లెవెల్ సరిచేయాలని జిఎంసి అధికారులకు సూచించారు. సమీక్షలో ట్రాఫిక్ సిఐ అశోక్‌కుమార్, ఆర్‌అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.విశ్వనాథరెడ్డి, డిఇ చిన్నయ్య, జెఇ సాయిక్రిష్ణ, నగరపాలక సంస్థ ఎస్ఇ కె.నాగేశ్వరరావు, సిటీ ప్లానర్ బి.రాంబాబు, సైట్ ఇంజినీర్ సుధీర్ పాల్గొన్నారు.

23 నుంచి గుంటూరులో ట్రాఫిక్ మళ్లింపులు

(మొదటి పేజీ తరువాయి)

ట్రాఫిక్ ఆంక్షలు అమలులోకి వస్తాయన్నారు. ఎస్పీ వివరాల ప్రకారం...

గుంటూరు బస్టాండ్ నుంచి అమరావతి రోడ్డుకి వెళ్లే వాహనాలను హిందూకళాశాల, మునిసిపల్ ట్రావెలర్స్ బంగ్లా, రమేష్ ఆస్పత్రి మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా వెళ్లాలి. మార్కెట్ నుంచి... లాడ్జి సెంటర్ వైపు వెళ్లే వాహనాలను మునిసిపల్ ట్రావెలర్స్ బంగ్లా మీదుగా కంకరగుంట ఫ్లైవోవర్ మీదుగా లక్ష్మీపురం జంక్షన్ నుంచి వెళ్లాలి. లాడ్జి సెంటర్ నుంచి మార్కెట్ వెళ్లే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, మూడు వంతెనలు మీదుగా వెళ్లవచ్చు. లేదా బ్రాడీపేట మీదుగా కంకరగుంట ఆర్‌వోబి ద్వారా కూడా వెళ్లవచ్చు. కోబాల్ట్ పేట, కృష్ణా నగర్, చంద్రమౌళి నగర్, బృందావన గార్డెన్స్, లక్ష్మీపురం పరిసర ప్రాంతాల నుండి మార్కెట్ వైపుకు వచ్చే కార్లు, ఆటోలు, బైక్‌లు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ రోడ్ లేదా బ్రాడీపేట 18 లైన్ ద్వారా కంకరగుంట అండర్‌పాస్ కలెక్టర్ ఆఫీస్ రోడ్, రమేష్ హాస్పిటల్ మీదుగా ప్రయాణించాలి. మునిసిపల్ ట్రావెలర్స్ బంగ్లా నుంచి లాడ్జి సెంటర్ వరకు వెళ్లే వారు కొంతకాలం తాత్కాలికంగా కార్లు, ఆటోలు, బైక్‌లు శంకర్ విలాస్ ఫైఓవర్స్ మీదుగా ప్రయాణించచ్చు. పట్టాభిపురం మీదుగా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే వారు కంకరగుంట ఫై ఒవర్ మీదుగా మెడికల్ కళాశాల, శంకర్ విలాస్ అండర్ పాస్ మీదుగా ఉన్న మార్గంలోకి వెళ్లాలి. మూడు వంతెనలు నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే వారు నాజ్ సెంటర్, పల్లవి థియేటర్ మీదుగా వెళ్లాలన్నారు. బస్టాండ్ నుంచి వచ్చే వారు కొత్తపేట మీదుగా పల్లవి థియేటర్ మీదుగా, మార్కెట్ ప్రాంతం నుంచి వచ్చే వారు మహిళా డిగ్రీ కళాశాల, పల్లవి థియేటర్ మీదుగా జిజిహెచ్‌కు వెళ్లవచ్చు. అమరావతి రోడ్డు నుంచి వచ్చే భారీ వాహనాలను ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి రెడ్డిపాలెం మీదుగా బస్టాండ్ వైపునకు మళ్లిస్తారు. అమరావతి రోడ్డు వైపు వెళ్లే భారీ వాహనాలను మునిసిపల్ ట్రావెలర్స్ బంగ్లా, కంకర గుంట ఫ్లైవోవర్, చిల్లీస్, ఇన్నర్ రింగ్ రోడ్డులోకి మళ్లిస్తారు. ఈ బ్రిడ్జినిర్మాణం పూర్తయ్యే వరకు దాదాపు రెండేళ్లపాటు ఈ ఆంక్షలు కొనసాగనున్నాయి.

నేటి నుండి పాలీసెట్ కౌన్సెలింగ్

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యే విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. శుక్రవారం నుండి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. ఒసి, బిసి విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీలు రూ.250 చొప్పున ఈనెల 27వ తేదీలోగా చెలించాలి. విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రసీదుతోపాటు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్లు ఫొటోస్టాట్ కాపీలతో హెల్ప్‌లైన్ సెంటర్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన వారికి 25వ తేదీ నుండి వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. 25, 26 తేదీల్లో 1 నుండి 50 వేల ర్యాంకు వరకూ, 27,28 తేదీల్లో 50001 నుంచి 90 వేలు, 29, 30వ తేదీల్లో 90001 నుంచి చివరి ర్యాంకు వరకూ వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు. వచ్చేనెల 1న ఆప్షన్లు మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుంది. 3న సీట్ల కేటాయిస్తారు. జులై 4 నుంచి 8వ తేదీలోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ షెడ్యూలు

తేదీ	ర్యాంకు
21న	1- 15000
22న	15001-32000
23న	32001-50000
24న	50001-68000
25న	68001-86000
26న	86001-104000
27న	104001-120000
28న	120001- చివరి ర్యాంకు వరకూ

వాచ్మెన్ కుటుంబంపై దాడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : గుంటూరు విద్యానగర్ ఒకటో లైన్ ఓం సాయి రెసిడెన్స్ అపార్ట్మెంట్లో వాచ్మెన్ కుటుంబంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం జిల్లా ఎస్పి సతీష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అపార్ట్మెంట్లో అద్దెకు ఉండే ప్రశాంత్, అతని డ్రైవర్ హనీఫ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వాచ్మెన్ కుటుంబానికి రక్షణ కల్పించాలని, నగరంలో ఉన్న అపార్ట్మెంట్ ఓనర్స్, అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



పొగాకు నాణ్యత పరిశీలిస్తున్న గుంటూరు కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక చుట్టుగుంటలోని సిడబ్ల్యుసి గోడౌన్ వద్ద మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవతేజ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ హెచ్‌డీ బర్లీ పొగాకు టాప్ గ్రేడ్ (హెచ్‌డీఎం) కేజీకి రూ.120, లోగ్రేడ్ (హెచ్‌డీ ఎక్స్) కేజీకి రూ.60కి కొనుగోలు చేస్తారన్నారు. జిల్లాలో ప్రతిపాడు, ఫిరంగిపురం, కాకుమాను తదితర ఎనిమిది మండలాల్లో 3653 మంది రైతులు హెచ్‌డీ బర్లీ పొగాకును 13,544 ఎకరాకల్లో సాగు చేసినట్లు సమాచారం ఉందన్నారు. పొగాకును ప్రభుత్వానికి అమ్మదల్చిన రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి వ్యవసాయ సహాయకుల ద్వారా సీఎంఏపీపీలో ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 1853 మంది రైతులు పొగాకు ప్రభుత్వానికి అమ్మటానికి నమోదు చేసుకున్నారని, వీరికి గుర్తింపు నంబర్ కేటాయిస్తూ సంక్షిప్త సమాచారం ఫోన్‌కు వస్తుందని, వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు ఎపీఏఐఎంఎస్ డేటా ద్వారా పరిశీలించిన అనంతరం నమోదు చేసుకున్న పొగాకు రైతులకు కొనుగోలు తేదీ, కొనుగోలు కేంద్రం అనుమతించిన పరిమాణం తదితర వివరాలను తెలుపుతారని వివరించారు. నమోదు చేసుకొని షెడ్యూల్ వివరాలు అందిన వారు మాత్రమే కొనుగోలు కేంద్రాలలో అమ్మకోవడానికి అర్హత ఉంటుందన్నారు. కొనుగోలు కేంద్రంకు పొగాకు బేళ్ళ నికర తూకం 25 కేజీలకు తగ్గకుండా 150 కేజీలకు మించకుండా సిద్ధం చేసుకుని తీసుకుని రావాలన్నారు. తేమ 20 శాతానికి మించరాదన్నారు. తేమ శాతాన్ని క్షేత్రస్థాయిలోనే పరిశీలించుకునేందుకు వీలుగా క్లసర్ పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో తేమ శాతం కొలిచే మిషన్లను అందుబాటులో ఉంచామన్నారు. పైన ఆకు , మధ్య ఆకు టాప్ గ్రేడ్, క్రింది ఆకు లోగ్రేడ్‌గా వేరు చేసి బేళ్లు తేవాలన్నారు. జిల్లాలో చుట్టుగుంటలోని సిడబ్ల్యుసి గోడౌన్ వద్ద, పెదకాకానిలోని సిడబ్ల్యుసి గోడౌన్ వద్ద కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రిజిస్ట్రేషన్‌లో, కొనుగోలు కేంద్రాల్లో సమస్యలుంటే రాష్ట్ర స్థాయిలోను జిల్లా స్థాయిలోనూ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి, జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరిగోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి యు.నరసింహారావు, కొనుగోలు టెక్నికల్ ప్రాజెక్టు మేనేజర్ కళ్యాణ్‌రామ్ పాల్గొన్నారు.



ఇకపై బ్లాక్‌బర్లీని సాగుచేయొద్దు : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-యడ్లపాడు

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మండల కేంద్రమైన యడ్లపాడు సమీపంలోని మైదవోలు స్పైసెస్ పార్కులో పల్నాడు జిల్లా పి.అరుణ్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. వ్యవసాయ సహాయకుల ద్వారా రైతులు తమ పేర్లను నమోదు చేసుకుని నిర్దేశించిన సమయంలో గ్రేడింగ్ చేసిన పంటతో కొనుగోలు కేంద్రానికి రావాలని కలెక్టర్ సూచించారు. నల్లబర్లీ కొనుగోలు, రిజిస్ట్రేషన్లు, క్రాప్‌హాలిడేపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మద్దతు ధర మీద ఆశతో భవిష్యత్తులో బ్లాక్‌బర్లీ సాగు చేయొద్దని, దీనికి ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించిందని చెప్పారు. భవిష్యత్తులో పొగాకు కొనుగోలు చేసే అవకాశం ఉండదన్నారు. అనంతరం గణపవరంలో ప్రైవేటు కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి రైతులకు మద్దతు ధర చెల్లించాలని వ్యాపారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళి, ఆర్డీఓ కె.మధులత పాల్గొన్నారు.

పనిగంటల పెంపుతో మరింత నిరుద్యోగం

(మొదటి పేజీ తరువాయి)

సృష్టికర్తలు కార్మికుల్ని కించపరిచే విధంగా పారిశ్రామిక వేత్తలే సంపద సృష్టికర్తలని చంద్రబాబు వక్రీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో కార్మిక హక్కులను అణచివేలనుకున్న ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పారని, భవిష్యత్‌లోనూ అదే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికే రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని, పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ లేదని, ఈ క్రమంలో రాత్రి వేళ కూడా పనికి ప్రభుత్వం చట్టబద్ధత కల్పించటం ద్వారా మహిళలపై దాడులు పెరిగే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రభుత్వం చేసిన అనాలోచిత నిర్ణయాలను తక్షణం ఉపసంహరించుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, కె.శ్రీనివాసరావు, ఎం.సాంబశివరావు, అబ్దుల్ సలీం, ఫణీంద్ర, ఖాసీం షహీద్, నికల్సన్, కోటేశ్వరరావు, ఎ.అరుణ్ కుమార్, ఎం.హనుమంతరావు, అంజిబాబు, కె.మాల్యాద్రి, సత్యనారాయణ, యు.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ నిరసన

స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరు బస్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టివిజి రవిశంకర్ అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిప్రసాద్ మాట్లాడారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పని గంటలను తగ్గించాల్సి ఉండగా, పెంచటం సరికాదన్నారు. పని గంటల పెంపు ద్వారా నిరుద్యోగం మరింత పెరుగుతుందన్నారు. ఆర్టీసీలో ఇప్పటికే అన్ని తరగతుల సిబ్బంది తీవ్రమైన పనిభారాలతో సతమతం అవుతున్నారని చెప్పారు. రవిశంకర్ మాట్లాడుతూ జులై 9న కార్మిక వర్గం దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.గంగాధర్‌రావు నిరసనకు మద్దతు తెలిపారు. ఫెడరేషన్ గుంటూరు-1, 2 డిపో కమిటీల నాయకులు ఎం.వి. ఎస్ రామకృష్ణ, వి.మధుసూదన్‌రావు, ఎస్ మురళీకృష్ణ, బీవీ రాఘవులు, ఆర్.శ్రీనివాసరావు, కె.అన్నామేరీ, జయశ్రీ, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏడాదైనా ఎక్కడి సమస్యలక్కడే

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. గుంటూరు నగరంలో యుజిడి పనులు పూర్తి చేయాలని, గోరంట్ల కొండపై నిలిచిపోయిన రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తి చేసి, శివారు ప్రాంతాలకు తాగునీరు అందించాలని కోరారు. శంకర్ విలాస్ బ్రిడ్జిని గతంలో ప్రతిపాదించినట్లుగా హిందూ కాలేజి నుండి అంబేద్కర్ సెంటర్ వరకూ సింగిల్ పిల్లర్‌తో, ఆర్‌యుబిలు కూడా ముందే నిర్మించాలన్నారు. గుంటూరు జిల్లాలో సుదీర్ఘ కాలంలో పెండింగ్‌లో ఉన్న గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించటానికి నిధులు కేటాయించాలన్నారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీలు, ఆశాలు, ఇతర స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులనే పేరుతో రేషన్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరాకరించటం సరికాదన్నారు. వంద పడలక ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని, దుగ్గిరాల కోల్డ్ స్టోరేజిలో పశుపు దగ్ధమైన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.నళినీకాంత్, ఇ.అప్పారావు పాల్గొన్నారు.

తెనాలిలో వరుస హత్యల కలకలం

- **మూడు వారాల్లో ముగ్గురు మహిళలు దారుణ హత్య**
- **వృద్ధులు, ఒంటరి మహిళలే లక్ష్యంగా బరితెగిస్తున్న దుండగులు**

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో వరుస హత్యలు స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. మూడు వారాల్లో ముగ్గురు మహిళలు హత్యకు గురికావటం చర్చనీయాంశమైంది. వృద్ధులు, ఒంటరి మహిళలే లక్ష్యంగా దుండగులు దాడి చేసి క్రూరంగా హతమార్చటం, ఆపై ఆభరణాలను దొంగిలించి సునాయాసంగా పరారవడం పోలీసులకు సవాలుగా మారుతోంది. ఈనెల 3న పట్టణంలో ఓ మహిళను హత్యచేసి, నగలతో ఉడాయించిన దుండగులను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన మరువక ముందే అదే తరహాలో ఇద్దరు మహిళలు హత్యకు గురికావటం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

ఒకే ఇంట్లో ఉంటున్న ఇద్దరు మహిళలు గురువారం పట్టపగలే దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. స్థానిక పరిమి రోడ్డులో నివాసం ఉండే దాసరి రాజేశ్వరి (65), పిటా అంజమ్మ (73) వియ్యపురాళ్లు. వీరిలో అంజమ్మ భర్త నాలుగేళ్ల క్రితం మృతి చెందగా, రాజేశ్వరి భర్త ఏడాది క్రితం మృతి చెందాడు. పిల్లలు కూడా ఉద్యోగాల రీత్యా దూరంగా ఉండటంతో వీరిరువురూ ఒకే ఇంటిలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వారు ఒంటరిగా ఉంటున్న విషయాన్ని గమనించిన ఇద్దరు యువకులు, ఓ మహిళ ఆటోలో వచ్చి తలుపు తట్టారు. గతంలో ఆ ఇంటిలో అప్పడాల ఫ్యాక్టరీ నడిపిన నేపథ్యంలో ఆ పనిమీద వచ్చినట్టు చొరబడిన దుండగులు మహిళలను తలపై ఆయుధాలతో మోది హతమార్చారు. వారి ఒంటిపై ఉన్న నగలు కాజేసి పరారయ్యారు. యువకులతో పాటు ఇంట్లోకి ప్రవేశించిన మహిళ ఆ వృద్ధురాళ్లకు పరిచయస్తురాలుగా తెలుస్తోంది. పైగా మృతి చెందిన మహిళల్లో ఒకరి చేతిలో కర్ర, మరొకరి చేతిలో తూకం రాయి ఉన్నాయి. దుండగులను మృతులు ప్రతిఘటించారా? మహిళలు వారిలో వారే పరస్పరం దాడి చేసుకుని మృతి చెందారని పోలీసులను తప్పుదారి పట్టించేందుకు దుండగుల పన్నాగమా? అనేది ప్రశ్నార్థకం. నిందితుల రాకపోకలు సమీపంలోని సిసి టివి ఫుటేజిలో రికార్డయినట్లు సమాచారం. దాని ఆధారంగానే పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఇదిలా ఉంటే ఈనెల 3న ముత్తింశెట్టివారిపాలెంలో టిఫిన్ బండి నిర్వహిస్తూ జీవించే ఒంటరి మహిళ తాడిపత్రి మల్లీశ్వరి (65)ని కూడా ఇలానే హతమార్చి ఆమె ఒంటిపై ఉన్న నగలనూ కాజేశారు. ఈ కేసులో నిందితులు పొరుగున ఉండే తారక జోషి, అతని సోదరుడు సతీష్ కుమార్ కలిసి ఒంటరిగా ఉంటున్న మల్లీశ్వరి ఒంటిపై ఉన్న నగలను కాజేసేందుకు పథకం ప్రకారం ఆమెను చంపినట్లు పోలీసులు వెల్లడించారు. దొంగిలించిన నగలను సంగంజాగర్లమూడికి చెందిన గాజులవర్తి కీర్తి వద్ద దాచారు. ఈ కేసులో నిందితులను ఈనెల 5న పోలీసులు అరెస్ట్ చేశారు. ఇలా మూడు వారాల్లో ముగ్గురు మహిళలు వరుసగా హత్యకు గురికావటంతో పట్టణంలో శాంతిభద్రతలపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోంది. పైగా ఇటీవల ఓ కేసులో నిందితులపై నడిరోడ్డుమీద థర్డ్‌డిగ్రీ ప్రయోగించిన పోలీసులు విమర్శల సుడిగుండంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే.

పోలీసుల తీరుపైనా విమర్శలు

వరుసగా ముగ్గురు ఒంటరి మహిళలు హత్యలకు గురికావటం పోలీసుల నిఘా వైఫల్యంగా విమర్శలు వినవస్తున్నాయి. ఇద్దరు మహిళలు హత్యకు గురైన పరిమి డొంక పరిసర ప్రాంతం మద్యం, గంజాయి సేవించే మూకలకు అడ్డా. ఈ ప్రాంతంలో బహిరంగంగా మద్యం సేవించే వారిని, గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్ట్ చేసిన సందర్భాలున్నాయి. పోలీసుల కట్టుదిట్టమైన భద్రత లేకే ఈ ప్రాంతంలో దుండగుల ఆగడాలు పెచ్చుమీరిపోతున్నాయని స్థానికులంటున్నారు. ముత్తింశెట్టివారిపాలెం ప్రాంతంలో కూడా దాదాపు ఆరు నెలల క్రితం ఓ మైనర్ బాలికను అపహరించి, లైంగికదాడికి పాల్పడిన సందర్భం లేకపోలేదు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ నిఘా కొరవడిందని, రాత్రి వేళల్లో పోలీస్ గస్తీ లేదన్న వాదనలున్నాయి. ఇప్పటికైనా పోలీస్ నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు మండలం శివారు దోప్పలపూడి గ్రామం అడ్డ రోడ్డు దగ్గర కుమార్ రైస్ మిల్లు వెనక డొంకలోని ఓ చెట్టుకు శుక్రవారం దోప్పలపూడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. స్థానిక రైతులు గమనించి రూరల్ పోలీసులకు సమా చారం అందించగా ఎస్సై కిరణ్‌బాబు ఘటన స్థలానికి చేరుకొని హత్యా? ఆత్మహత్య?.. అనే కోణంలో విచారి స్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉరివేసుకున్న వ్యక్తి

భూసార పెంపుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - కారంపూడి

మండలంలోని పేట సన్నగండ్ల, పెద కొదగుండ్ల, గాదే వారిపల్లి గ్రామాలలోనే పత్తి పంట క్షేత్రాలను లామ్ ఫార్మ్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్. రాజమణి, ఎల్. రాజేష్ చౌదరి, ప్రతి ప్రధాన శాస్త్రవేత్త మరియు జిల్లా వనరుల శిక్షణ కేంద్రం ఎఫ్‌టిసి, డిడిఏ శివకుమారి, పిడుగురాళ్ల సహాయ సంచాలకులు కష్ణదేవరాయలు, మండల వ్యవసాయ అధికారి పోట్ల. నరసింహారావు ఆయా గ్రామాలలో పర్యటించి మాట్లాడుతూ రైతుల ప్రస్తుతం ప్రతి పంటలకు ఎరువులు, పురుగుమందులు పిచికారి చేయవలసిన అవసరం లేదు అని తెలిపారు. జీలుగులు, జనుము వంటి పచ్చి రొట్ట పైర్లు వాడుతూ భూసారాన్ని పెంచి భూమిని కాపాడి మంచి దిగుబడులు పెంచుకోవాలని వారు సూచించారు. రైతులకు అవసరమైన పరికరాలు తైవాన్ స్ప్రేయర్స్, ట్రాక్టర్ సామాన్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి నరసింహారావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో విత్తనాలు, పరికరాలు అన్ని రైతు సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఆర్. వెంకటేశ్వర్లు నాయక్, షేక్. హజ్రాబి ఎక్. ఇమాంబి, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని అల్లంవారి పాలెం గ్రామానికి చెందిన ఆఖ్యం వెంకట శివరాం (23) తాపీ పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య, ఇద్దరు మగ పిల్లలు సంతానం. ఈనెల 18వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో భోజనంలోకి కూరలు తెచ్చుకునేందుకు బైక్‌పై బయటకు వెళ్లాడు. కూరలు కొనుక్కుని ఇంటికి వస్తుండగా వసంత నగర్ వద్దకు రాగానే బైక్‌కు కుక్కపిల్ల అడ్డు వచ్చింది. అదుపు తప్పి బైక్ నుంచి కిందపడ్డాడు. సంఘటనలో అతని తలకు తీవ్ర గాయలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు గవర్నమెంట్ ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిని చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిరం గిపురం పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ పెద్ద మరణించడంతో ఇక మాకు దిక్కెవరంటూ రోదించడం పలువురిని కలచివేసింది.



మృతి చెందిన వెంకటశివరాం

వెలుగు ఉద్యోగులకు గాయాలు

ప్రజాశక్తి - యడ్లపాడు

విధి నిర్వహణలో ఉన్న వెలుగు ఉద్యోగులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు వెలుగు సొలస క్లస్టర్ సీసీ జి నాగేశ్వరరావు, వీవోఏ షేక్ రహేనా స్వయం సహాయక సంఘాల విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం కొండ వీడు వెళ్లారు. అదే పనిపై పక్కనే ఉన్న సంతపేటకు నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో అదేమార్గంలో మద్యం సేవించి ద్విచక్ర వాహనం వస్తున్న షేక్ జహీర్ వెలుగు ఉద్యోగులను ఎదురుగా ఢీకొట్టాడు. ప్రమాదంలో నాగేశ్వరరావు కాలు విరిగిపోయింది రహనాకు స్వల్ప గాయాలయ్యాయి నాగేశ్వర రావును 108లో నరసరావు పేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులకు పిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.



విద్యార్థులకు ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఫ్లోరోసిస్ వ్యాధి నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - అమరావతి

మండలపరిధి ఉంగుటూరు గ్రామంలోని అమరావతి కోలోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్యమందిరంలో జాతీయ ఫ్లోరిసిస్ నియంత్రణ, నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా గుంటూరు జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్ హాజరై ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ గురించి ఎంపిపిఎల్‌ఈ, ఎంపీయు పి పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ గిరిధర్ గారు మాట్లాడుతూ ఫ్లోరోసిస్ ఏ విధంగా వ్యాప్తిస్తుందో, దానిని ఏవిధంగా నివారించవచ్చో తెలియ జేసారు. ముఖ్యంగా బోర్‌వెల్ తాగు నీటిద్వారా, పొగాకు సంబంధింత వస్తువుల ద్వారా, పానీపూరి, కుర్‌కురే తినడం వల్ల అందులో కలిపే బ్లాక్‌సాల్ట్ వల్ల, బ్లాక్‌టీ వంటివి మితి మీర ఉపయోగిస్తే ప్రజలు త్వరగా ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడతారని వివరించారు. 3, 4, 5 వ తరగతి పిల్లలందరికి వైద్య పరీక్షలు నిర్వహించారు. నివారణలో భాగంగా రక్షిత తాగునీరు, కాల్షియమ్, విటమిన్ సి,ఇ అధికంగా పోషకాలు ఉన్న కూరలు,పండ్లు తీసుకోవాలన్నారు.ఆరోగ్య విస్తరణ అధికారి కె. లక్ష్మి మనో హర్, సిహెచ్ఓ సంధ్యా రాణి, ఏఎన్ఎం ఆశాకుమారి, హెచ్ ఏ కోటేశ్వరరావు, ఆశాకార్యకర్తలు బుజ్జి, విజయమ్మ, పాల్గొన్నారు



పీఎం సూర్య ఘర్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ సిబ్బంది

పిఎం సూర్య ఘర్ పథకంపై ప్రచారం

ప్రజాశక్తి - కారంపూడి

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యువజన పథకం పై కారంపొడి పట్టణంలోని విద్యుత్ సిబ్బంది శుక్రవారం కర పత్రాలు పంపిణీ చేసి అవగాహన కార్యక్రమం చేపట్టారు. గృహాలకు తగిన రూఫ్ టాప్‌సోలార్ ప్లాంట్ ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఎలా అమర్చుకోవాలి, వాటి వలన ఉపయోగాలను, బ్యాంకు రుణాలు, లబ్ధిదారుల వాటా ఎంత అనే విషయాలను వివరించి వినియోగదారుల నుండి ధవపత్రాలు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో ఏఈ జి.వీరాంజనేయులు, లైన్‌మెన్ హరికృష్ణ, పాపారావు, నాగలక్ష్మి, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

బాసట(సామాజిక సాంస్కృతిక వేదిక) ఆధ్వర్యంలో రెగ్యులర్ షుగర్, బిపి ఉచిత వైద్య శిబిరంతో పాటు ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఈ నెల 22వ తేదీ యడ్లపాడు పిఆర్ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు క్యాంపు నిర్వాహ కులు ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపులో ఆలోకం వెంకాయమ్మ తృతీయ సంస్మరణోత్సవం సందర్భంగా వారి భర్త ఆలోకం పెద్దబ్బాయి ఆర్థిక సహకారంతో ఈసీజీ, కిడ్నీ పరీక్ష, కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. క్యాంప్ పర్యవేక్షకులుగా డాక్టర్ గోపాలం శివన్నారాయణ, సీనియర్ డాక్టర్ లింగ మల్ల మోహన్ భాస్కర్ పాల్గొంటారు. ఈ అవకా శాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలి పారు. రెండు నెలలకు సరిపడా మందులు ఇస్తారని పేర్కొన్నారు.

నల్లబర్లీ రైతులు ఆందోళన చెందొద్దు... కొనుగోళ్లు చేపడుతున్నాం

మైదవోలులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ - కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నల్ల బర్లీ పొగాకు రైతులు మద్దతు ధర విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, మద్దతు ధరతో పంట కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ మాట్లాడుతూ గతంలో పోలిస్తే 2024-25 సంవత్సరంలో రెట్టింపు విస్తీర్ణంలో బ్లాక్ బర్లీ సాగు జరగడంతో మంచి దిగుబడి వచ్చినప్పటికీ ఆశించిన ధర అందడం లేదన్నారు. ప్రైవేటు వ్యాపారస్తుల ద్వారా గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసేందుకు ఇదివరకే చర్యలు చేపట్టామన్నారు. తాజాగా మైదవోలులో మార్క్‌ఫెడ్ కేంద్రంలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని వివరించారు. నల్లబర్లీ పొగాకు అమ్మదలిచిన రైతులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇప్పటికే 1600 మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తయిందని, రైతులు పొగాకు గ్రేడింగ్ చేసి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.

ఈ ఏడాది బ్లాక్ బర్లీ క్రాప్ హాలిడే
ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి

పొగాకు ధరలు పతనమవుతున్న దృష్ట్యా జిల్లాలో ఈ ఏడాది నల్ల బర్లీ పొగాకు పంటకు క్రాప్ హాలిడే ప్రకటించాలని రైతులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఆదాయం లేని పంటల సాగుకు రైతులు దూరంగా ఉండాలన్నారు. నల్లబర్లీ క్రాప్ హాలిడే గురించి వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలనీ, జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. కొన్నేళ్ల నుండి మొక్కజొన్న రైతుల కు మంచి దిగుబడి, ఆదాయం వచ్చిన సంగతి గుర్తు చేశారు. జిల్లాలో రైతుల ఆత్మహత్యలు నివా రించేందుకు ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలి స్తున్నామని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ శాఖ సిబ్బందికి రెవెన్యూ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్య క్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో మురళి, జిల్లా వ్యవసాయ అధికారి మురళి పాల్గొన్నారు.

దళారులకు పొగాకు అమ్మి మోసపోవద్దు : తహశీల్దార్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పొగాకు రైతుల వద్దకు దళారులు వస్తే ఊరు కోవద్దు అని మండల తహశీల్దార్ మొహమ్మద్ హుస్సేన్ శుక్రవారం అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన పొగాకు కేంద్రాల్లోనే రైతులు పొగాకు అమ్ముకోండన్నారు.నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. అందులో భాగంగా పొగాకు కొనుగోలు కేంద్రాన్ని యడ్లపాడు మండలం మైదవోలు పరిధి లోని స్పైసెస్ పార్కులో కలెక్టర్ అరుణ్ బాబుప్రారం భించారన్నారు. కొన్ని నియమాలు పాటించి రైతులు స్వేచ్ఛగా తమ పొగాకు అమ్ముకోవొచ్చు అన్నారు. కార్యక్రమంలో చిలకలూరి పేట వ్యవసాయ అధికారిని సరిత పాల్గొన్నారు.

రైతుల వద్ద కందులు, పత్తి కొనుగోలు చేయాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - వినుకొండ

రైతుల వద్ద ఉన్న కందులు, పొగాకు చేయాలని రైతు సంఘం నాయకులు శుక్రవారం డిమాండ్ చేశారు. రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ కొనుగోలు కేంద్రాల ద్వారా పంటలు కొనుగోలు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న మాటలు నీటి మూటలేనని రైతు సంఘం నియోజవర్గ అధ్యక్షులు చేకూరి సురేష్ రాజా అన్నారు. కందులు కొనుగోలు విషయంలో రైతులను తీవ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. క్వింటా కంది పంట ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం రూ.7500కు కొనుగోలు చేస్తున్నామని, రైతుల వద్దకే పంట పరీక్ష సిబ్బంది వచ్చి నిర్ధారణ అనంతరం ప్రభుత్వం పంటను కొనుగోలు చేస్తుందని తెలిపారు. కంది పంట పరీక్ష చేసే సిబ్బంది రైతుల వద్దకు వచ్చి లావు సన్నం అనే వంకలు పెడుతూ అభ్యంతరాలు పెట్టి కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. రైతుల సమాచారం మేరకు గురువారం రాత్రి నూజెండ్ల మండలం ములకలూరు గ్రామం రైతు సంఘం నాయకులకు సందర్శించి రైతుల వద్ద నిలువ ఉన్న కందులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. గ్రామంలో సుమారు 2000 క్వింటాలకు పైగా కంది పంట నిల్వ ఉన్నాయని, రైతులందరూ ఈక్రాప్ బుకింగ్ చేస్తున్నవారని వివరించారు. గ్రామంలో కొందరు రైతులు ఇటీవల ప్రకాశం జిల్లా అద్దంకి వద్ద వారి బంధువుల సహాయంతో సుమారు 100 క్వింటాల్ వరకు ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం 7500 కు కొనుగోలు కేంద్రాల్లో అమ్మడం జరిగిందన్నారు.ఈ క్రాప్ చేయించుకున్న రైతుల వద్ద కూడా ప్రభుత్వం గిట్టుబాటు ధరకు పంట కొనుగోలు చేయకపోవడంతో మండలంలో అనేక గ్రామా ల్లో రైతుల వద్ద కంది పంట నిలువ ఉన్నట్టు తెలిపారు. అనేక గ్రామాల్లో పొగాకు పంట కూడా నిలువ ఉందని వివరించారు. ప్రభుత్వం పంటలను కొను గోలు చేయకపోతే కంది, పొగాకు రైతులకు జరుగు తున్న అన్యాయంపై రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరుకు వినతి పత్రం ఇవ్వడంతోపాటు, ఆందోళన చేపడతామని రైతు సంఘం నాయకులు హెచ్చరించారు. నాయకులు ముని వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

8 గంటల పని విధానం అమలు చేయాల్సిందే

మేడే స్ఫూర్తితో కార్మికవర్గం, నిరుద్యోగులు పోరాటాలకు సిద్ధం కావాలి : సిఐటియు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కూటమి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక వర్గానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటుందని పరిమితులు లేని 14 నుండి 20 గంటల పని విధానానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాల రాస్తున్నాయని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు మండిపడ్డారు. శుక్రవారం నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తూ 10 గంటల విధానం అమలు చేయాలని నిర్ణయించడం సిగ్గుచేటనీ, రాత్రి సమయంలో మహిళలతో పని చేయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను కాలరాసే విధంగా పని గంటలను పెంచుతూ కూటమి ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ రంగంలో పని చేసే కార్మికులకైనా కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని అవహేళన చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్మికవర్గానికి తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. లేబర్ కోడ్‌లు నిలుపు చేయకపోతే మోడీ ప్రభుత్వం కార్మిక వర్గ ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని కూటమి నేతలను హెచ్చరించారు. ఎన్నో సందర్భాలలో సిఐటియు కార్మికులకు అండగా నిలిచి చేసిన పోరాటాలలో విజయం సాధించిందని గుర్తు చేశారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రెవిన్యూశాఖ అత్యంత కీలకమైనదని, ప్రతి రెవెన్యూ ఉద్యోగి సేవా భావంతో విధులు నిర్వహిస్తే అద్భుతమైన ఫలితాలు ఉంటాయన్నారు. బ్రిటీష్‌కాలం నుంచి ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా రెవెన్యూశాఖ పని చేస్తోందన్నారు. ప్రజాపరిపాలనలో రెవెన్యూశాఖ ఎంతో కీలకమని, రెవెన్యూ విభాగం ద్వారా సుమారుగా 88 రకాల సేవలను అందిస్తున్నట్టు తెలిపారు. భూమి రికార్డుల నిర్వ హణ, పన్నుల వసూలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రెవెన్యూ సిబ్బంది పాత్ర కీలకమని ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేశారు. వేడుకల్లో డిప్యూటీ తహశీల్దార్ బత్తుల వాణి, ఆర్ఐ ఇంటూరి అనీల్ కుమార్, సర్వేయర్ సాల్మాన్ రాజు, మండలంలోని పలు గ్రామాల రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

కారంపూడిలో

స్థానిక మండల తహసిల్దార్ కార్యాలయంలో మండల తహసిల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవిన్యూ డే నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. తహసిల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో రెవిన్యూ సమస్యలపై వెంటనే దృష్టి సారించి పరిష్కరిస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా నని తెలిపారు.

పెదకూరపాడులో

అన్ని శాఖల్లో కల్లా రెవెన్యూ శాఖ కీలకమని పెదకూరపాడు అడహక్ తహసిల్దార్ ఎన్ ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం రెవెన్యూ డే సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజలకు కావాల్సిన అన్ని రకాల సర్టిఫికెట్లు సకాలంలో ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించండి : ఎస్ఇ

ప్రజాశక్తి - రాజుపాలెం

మాచర్ల డివిజన్ పరిధిలోని కొండమోడులో విద్యుత్ శాఖ ఎస్ఇ. డాక్టర్ పి. విజయ్‌కుమార్ విద్యుత్తు అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వినియోగ దారులకు నాణ్యమైన విద్యుత్తు అందించాలని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించాలని తెలిపారు. సూర్య ఘర్ ముఫ్ట్ బిజిలి యోజన పథకం కింద రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 25వ తేదీలోపు పూర్తి చేసి అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూతల పాటి సింగయ్య డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి నాగ సురేష్ బాబు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోట పెద్దమస్తాన్, మండల,జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఎమ్మెల్యేకు సచివాలయ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో పని చేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు జి ఎస్ డబ్ల్యు ఎస్ ఉద్యోగులకు సొంత మండలంలో పోస్టింగ్ ఇవ్వొద్దని వచ్చిన జి.ఓ నెం.5కు వ్యతిరేకంగా శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి ప్లకార్డులు పట్టుకొని శాంతియుతంగా ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, మున్సిపల్ కమిషనర్లకు డీఎంహెచ్వో కార్యాలయంలో వినతిపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళానని చెప్పినట్లు గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర మీడియా ఆర్డినేటర్ మొహమ్మద్ అలీ తెలిపారు. జిడబ్ల్యూఎస్ఈఏ జిల్లా నాయకురాలు కె.విజయలక్ష్మి, నరసరావుపేట ప్రెసిడెంట్ సిహెచ్. ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగుల్ మీరా, పి.రమేష్, సుజాత, రమేష్ నాయక్, మహిమజ్యోతి, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి శిబిరానికి ఎన్ఇసి క్యాడెట్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తెలుగు రాష్ట్రాల ప్రతిష్టాత్మకమైన తల్‌సైనిక్ శిబిరానికి ఇంటర్‌గ్రూప్ కాంపిటీషన్ శిబిరానికి నరసరావుపేట మండలం కోటప్పకొండ రోడ్డులోని ఎన్ఇసి కళాశాలకు చెందిన 10 మంది ఎన్‌సిసి క్యాడెట్స్ ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. జూలై7వ-16వ తేదీ వరకు అనంతపూర్ లో తల్ సైనిక్ - ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్ జరుగుతుందని తెలిపారు. కళాశాల ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసి, కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు, 23వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎన్.ఎస్. పర్మర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంక టేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సునీల్ ఎన్.సిసి అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్ బాబు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఎంపికైన కాడేట్స్‌ను అభినందించారు.

ఇంఛార్జి ఎంపిపిగా పరిమళ మనీషా

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల మండల పరిషత్ అధ్యక్షురాలు బూడిద మంగమ్మ అందుబాటులో లేని కారణంగా మాచర్ల మండల పరిషత్ ఉపాధ్యక్షురాలైన పరిమళ మనీషాని ఇంచార్జీ అధ్యక్షురాలుగా నియమిస్తూ గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇంచార్జీ ఎంపిపిగా నియమించటం పట్ల మనీషాను పలువురు నాయకులు, ఎంపీటీసీలు అభినందించారు.



నిత్యశ్రీని సన్మానిస్తున్న మదర్ థెరిసా సేవా సమితి సభ్యులు

మెడికల్ ర్యాంకు సాధించిన నిత్యశ్రీకి సన్మానం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల మండల పరిధిలోని రాయవరం గ్రామానికి చెందిన చిలమకూరి శ్రీనివాస్ రెడ్డి పద్మావతి కుమార్తె చిలమకూరి నిత్యశ్రీ ఇటీవల జరిగిన మెడికల్ ఎంట్రన్స్‌లో ఆల్ ఇండియా 4,500 ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ 401 ర్యాంకు సాధించింది. ఈ సందర్భం గా నిత్యశ్రీని మదర్ థెరిసా సేవా సమితి వారు ఘనంగా సత్కరించారు పట్టణ ప్రముఖ లాయర్ సిహెచ్ నాగిరెడ్డి ఆమెను సత్కరించి మాట్లాడుతూ నిత్యశ్రీ మట్టిలో మాణిక్యమని, భవిష్యత్తులో ప్రముఖ వైద్యురాలుగా మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకొని సేవలు చేయాలని ఆకాంక్షించారు. నిత్యశ్రీని సన్మానినంచిన వారిలో సేవా సమితి సభ్యులు గాదె కిరీటిరెడ్డి, అందుగుల చంద్రయ్య, భాస్కర్ రెడ్డి, చిన్నపరెడ్డి శాంతి రెడ్డి, కంబంపాడు జడ్పీహెచ్ఎస్ ప్రధాన ఉపాధ్యాయురాలు విజయ కుమారి, హెడ్మాస్టర్ పార్వతి, లాయర్ అందుగుల జోజి, అడ్వకేట్ గట్ల సత్యనారాయణ రెడ్డి, గుంజా ప్రసాద్ కాలేజీ ప్రిన్సిపాల్ కుర్రి సాయి మార్కోండారెడ్డి ఉన్నారు.



ట్యాబులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆర్పీలకు ట్యాబులు పంపిణీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మెప్మా ఆర్పీ లకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ట్యాబులు పంపిణీ చేశారు. సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో 33మంది మెప్మా ఆర్పీలకు గాలక్సీ ట్యాబులు, 25 మందికి ఫింగర్ స్కానర్‌లను ఎమ్మెల్యే అందచేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు యెలినేడి రామస్వామి దరువూరి నాగేశ్వరరావు మున్సిపల్ కమిషనర్ ఆనంద్ మెప్మా సిబ్బంది ఆర్పీలు పాల్గొన్నారు.

ఓటు ఒక ఆయుధం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఓటు హక్కు ధనిక,పేద తేడా లేకుండా రాజ్యాంగం ఇచ్చిందని, ఓటుని ఆయుధంలా వినియోగించు కోవాల్సిన బాధ్యత మనదేనని మండల తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్ శుక్రవారం అన్నారు. మండల పరిధిలో మురికిపూడి గ్రామంలో శారదాంబ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రావు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఓటు గూర్చి అవగాహన కార్యక్రమంలో అయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. అవగాహన కార్యక్రమంలో రావు సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయు రాలు దేవరకొండ ధనలక్ష్మి, నరేంద్ర శర్మ, బి శంకర్, కంచరగుంట సుజాత,షేక్ షకీలా, షేక్ షమ్మీ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

9న జరిగే సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు



సమ్మె నోటీసు అందిస్తున్న నన్నపని శివాజీ, పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి - పెదకాకాని

పంచాయతీ కార్మికుల న్యాయమైన హక్కుల కోసం జులై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు నన్నపనేని శివాజీ పిలుపు నిచ్చారు. పెదకాకాని మండలం శుక్రవారం ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో వెనిగండ్ల గ్రామపంచాయతీ కార్యదర్శికి, అగతవరప్పాడు గ్రామపంచాయతీ కార్యదర్శికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 21000 ఇవ్వాలని జీవో నెంబర్ 132. 142. 680 అమలు చేయాలని టెండర్లపై హైకోర్టు తీర్పు అమలు చేయాలని జులై 9న జరిగే సమ్మెలో పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు పంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవులు పండుగ సెలవలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, కార్మికుల తొలగింపును ఆపాలని, ప్రభుత్వ రంగ సంస్థలు రైల్వే, పోస్టల్ ఎల్ఐసి ఓడరేవులు విశాఖ స్టీల్ ప్లాంట్ లాంటి సంస్థలు ప్రైవేటు కరణ ఉపసమరించుకోవాలని, 10 గంటలు పని చేయాలి అనే నిబంధన తొలగించాలని వెనిగండ్ల గ్రామపంచాయతీలో గత 10 నెలలుగా సబ్బులు, నూనె, గుర్తింపు కార్డులు ఇవ్వలేదని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు రాజా రమేష్ ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు తాడిపోయిన ధర్మరాజు, కె.బాబు, డేగల ఏసోబు. టి.అంజిరెడ్డి, డి.మరియమ్మ, రత్నకుమారి, కె.కీర్తిలక్ష్మి పాములు తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలలో రెండో విడత ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఐటిఐ కాలేజీల్లో ఆగస్టులో రెండో విడత ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో (iti.ap.gov.in) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్థాయి శిక్షణ సంస్థ ప్రభుత్వ ఐటిఐ సహాయ సంచాలకులు బిఎస్ఎస్ఎస్‌వి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను జులై 15వ తేదీ రాత్రి 11.55 గంటలలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు కోసం నెట్ సెంటర్‌లోగానీ, ప్రభుత్వ ఐటిఐ కాలేజీల్లోగానీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జులై 17వ తేదీన, కౌన్సెలింగ్ 21, 22వ తేదీల్లో జరుగుతుందన్నారు.



చురుగ్గా 'సుపరిపాలన - తొలి అడుగు' ఏర్పాట్లు

ప్రజాశక్తి - తుళ్లూరు

ఈ నెల 23న రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం వెలగపూడిలో సచివాలయం సమీపంలో 'సుపరిపాలన - తొలి అడుగు' కార్యక్రమం జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ పరిశీలించారు. ముఖ్యమంత్రి వర్యుల కార్యక్రమానికి సంబంధించి నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు అందించారు. సభా స్థలి ఏర్పాట్లు, భారీ కెటింగ్ వాహనాల పార్కింగ్ సిటింగ్ తదితర ఏర్పాట్లపై అధికారులతో చర్చించి సూచనలు జారీ చేశారు. త్రాగునీరు అందుబాటులో వుంచాలని, పారిశుధ్య ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.త్వరితగతిన ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. అధికారులందరూ తమకు కేటాయించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు, సి ఆర్ డి ఎ ఈఈ శ్రీనివాస రావు, తహశీల్దార్ సుజాత ఇతర అధికారులు పాల్గొన్నారు..



పట్టణంలో పడమర కాలువలో జరుగుతున్న - పనులు

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి తెనాలి

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు సాగు, తాగు నీటికి ప్రాధాన్యత నిచ్చారు. ముఖ్యంగా సాగునీటికి ఇబ్బందులేకుండా కాలువల పూడికతీత పనులు చేపట్టారు. దాదాపు వారం రోజుల క్రితం దుగ్గిరాల నుంచి ప్రారంభమైన పనులు ప్రస్తుతం తెనాలికి చేరాయి. పడమర కాలువలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ బ్రిడ్జి నుంచి ఎడ్ల లింగయ్య పెట్రోల్ బంక్ వరకు కాలువలో వ్యర్థాలను పొక్లెయిన్ సాయంతో తొలగిస్తున్నారు. ఈ పనులు కూచిపూడి సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు కొరటాల లీలా సాయి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

28న 'చలో తెనాలి'ని జయప్రదం చేయండి



ధర్నాలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి- తాడేపల్లి

తెనాలి అయితా నగర్‌లో నడి బజార్లో దళిత యువకులపై పోలీసులు జరిపిన అమానవీయ చర్యను ఖండిస్తూ ఈనెల 28న జరిగే చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా నాయకులు జొన్నకూటి నవీన్ ప్రకాష్ కోరారు. శుక్రవారం తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్ నగర్ సెంటర్లో గల అంబేద్కర్ బొమ్మ వద్ద కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు బురగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో కెవిపిఎస్ నాయకులు జన్నకూటి నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ పోలీసులు వారి హీరోయిజం ప్రదర్శించటానికి దళిత మైనారిటీల పై అక్రమ కేసులు బనాయించి దుర్మార్గ గా వ్యవహరించటం సరైనది కాదని విమర్శించారు. చట్టాన్ని రక్షించ వలసిన పోలీసులు బక్షించే విధంగా తయారయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లాటి చేతిలో ఉందని ఇష్టం వచ్చినట్లు వ్యవహరించే హక్కు పోలీసులకు రాజ్యాంగం కల్పించలేదని చెప్పారు. అనేక రాష్ట్రాల హైకోర్టు లు, భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాలును సైతం పోలీసులు లెక్క చేయకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కొన్ని కేసులు న్యాయస్థానాలు అక్షింతలు వేసిన పోలీసుల తీరులో మార్పు రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలను ప్రజలందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. తెనాలి పోలీసులు ల చర్యలు పట్ల మౌనం గా ఉంటే ప్రజాస్వామ్యం లో ప్రజల మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్నూలు లో ఎమ్మెల్యేపార్థసారధి దళిత సర్పంచ్‌ను కులవివక్ష చూపుతూ అవమానించడం దుర్మార్గం అన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ఎమ్మెల్యే ఆ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరా యటం ఏంటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పార్థసారధి పై ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.ప్రభాకర్, డి.చిన్న దుర్గారావు,మహేష్, శ్రీకాంత్ ,అంకయ్య, నవనీతమ్మ, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ సర్జరీలతో నూరుశాతం కచ్చితత్వం



రోబోటిక్ సదస్సులో నరేంద్రరెడ్డి

ప్రజాశక్తి - గుంటూరుజిల్లా ప్రతినిధి

రోబోటిక్ సర్జరీల ద్వారా రోగికి మనం నూరు శాతం ఖచ్చితత్వాన్ని అందించవచ్చని సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. రానున్న కాలంలో వైద్య రంగం పురోభివఅద్ధిలో రోబోటిక్‌ల పాత్ర ప్రధాన భూమిక పోషించనుందని అన్నారు. రష్యా రాజధాని మాస్కోలో యూరో ఆసియన్ ఆర్థోపెడిక్ ఫోరం వేదికగా జరుగుతున్న ప్రదర్శనలో శుక్రవారం డాక్టర్ నరేంద్ర రెడ్డి జాయింట్ రీప్లేస్మెంట్ లో రోబోటిక్ వాడకంపై మెలుకువలు, అవకాశాలు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తదితర అంశాలను వివరించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఈ సమావేశాలకు రష్యాకు చెందిన దాదాపుగా 500మందికి పైగా ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు హాజరయ్యారు. భారత్ లో జరుగుతున్న మోకీలు, తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలలో రోబోటిక్ పాత్ర, అనుభవాలను డాక్టర్ నరేంద్ర రెడ్డి వివరించారు.

అభివృద్ధి పనులకు మేయర్, ఎమ్మెల్యే శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 28వ డివిజన్‌లో రూ. పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర లు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ 28వ డివిజన్‌లో హౌసింగ్ బోర్డు కాలనీ "0" లైన్ లో రూ 34 లక్షలతో సీసీ డ్రెయిన్లు, వెంకటరమణ కాలనీ 4వ లైన్ అండ్ 5వ లైన్ లలో రూ.50 లక్షలు, సీతమ్మ కాలనీ "0" లైన్ అడ్డరోడ్లు సిసి రోడ్లు, డ్రైనుల రూ.50 లక్షలు, మొత్తం రూ. 1కోటి 34లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ 28వ డివిజన్‌లో గడిచిన ఐదేళ్ల కాలంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తెల్లగోర్ల అప్పారావు (ఏపీ యాదవ్), మదమంచి శ్రీనివాస్, మామిడి రామారావు, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో స్ప్గాన్న కార్మికులు

199వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 199వ రోజుకు చేరుకుంది. దీక్షలలో షైక్ ఖాసీం, సి హెచ్ పిచ్చయ్య, ఎం గురవయ్య, తుపాకుల నాగేశ్వరావు, కె.హగ్గయ్య లు కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాణిక్యరావు, షైక్ బాషా, షైక్ సుభాని, ఇమాంబీ, ఎం.శివకుమారి, దుర్గాభవాని, రమణ, సారమ్మ, బి.సూర్యప్రకాశరావు, వై.సాంబశివరావు పాల్గొన్నారు.

తూర్పు సర్వేయర్ సుభాని సరెండర్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థ తూర్పు సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ మహబూబ్ సుభానిని కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి, ప్రజా ఫిర్యాదుల మేరకు కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం మాతృశాఖకు సరెండర్ చేశారు. కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంపై గతంలో పలుమార్లు హెచ్చరించినా పనితీరు మెరుగు పరుచుకోక పోవడం, సర్వే కోసం అర్జీలు అందించిన ప్రజల నుండి సర్వే సర్టిఫికెట్ల జారీలో అధికంగా ఫిర్యాదులు అందుతున్నందున సరెండర్ చేసినట్లు కమిషనర్ తెలిపారు. నగరపాలక సంస్థలో కొరత ఉన్నందున డైరెక్టర్ సర్వే, సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఆంధ్రప్రదేశ్ వారికి జిఎంసికి అదనంగా సర్వేయర్లను కేటాయించాలని లేఖ రాశారు.

నేడు యోగా శిక్షణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి యోగ కార్యక్రమం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరుగుతుందని, నగరంలోని వార్డ్ సచివాలయ కార్యదర్శులు, జిఎంసి అధికారులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఇన్‌చార్జి) చల్లా ఓబులేసు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎంఎల్సీలు, ఎంఎల్ఏలు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు.

వైసిపి కార్యకర్త కుటుంబానికి రూ.10 లక్షలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ సిఎం వైఎస్ జగన్ రెండు రోజుల క్రితం సత్తెనపల్లి పర్యటనకు వెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదానికి గురై మరణించిన వెంగళాయపాలెం వైసిపి కార్యకర్త సింగయ్య కుటుంబ సభ్యులకు వైసిపి నాయకులు శుక్రవారం రూ.10 లక్షల చెక్కును అందచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డి, ప్రత్తిపాడు వైసిపి సమన్వయకర్త బలసాని కిరణ్ పాల్గొన్నారు.

నేడు పల్నాడులో అంతర్జాతీయ యోగా దినోత్సవాలు

జిల్లా వ్యాప్తంగా 5 వేల వేదికలు - ఏకకాలంలో పాల్గొననున్న రెండు లక్షల మంది ప్రజలు

అమరావతి స్తూపం వద్ద 2 వేల మందితో, కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్స్‌లో 10 వేల మందితో



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నేడు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నామని కలెక్టర్ పి.అరుణ్ బాబు వెల్లడించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 5 వేల వేదికల వద్ద ఏకకాలంలో యోగాంధ్ర కార్య క్రమాలు నిర్వహిస్తామన్నారు. యోగాంధ్ర యాప్ ద్వారా దాదాపు 10 లక్షల మంది ఔత్సాహికులు నమోదు చేసుకున్నారనీ, వీరిలో 2 లక్షల మంది నేడు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, హాస్టళ్లు, గ్రామ, వార్డు సచివాలయాల వద్ద నిర్వహించే యోగాంధ్ర కార్య క్రమాలలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్ నందు 10 వేల మందితో యోగా సమ్మేళనం, ఆర్కియాలజికల్ సర్వే శాఖ ఆధ్వర్యంలో అమరా వతి బౌద్ధ స్తూపం వద్ద 2 వేల మందితో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. యోగాంధ్ర కార్య క్రమాన్ని మే 21 నుంచి ఈనెల 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి బైపాస్ రోడ్డుకు ప్రత్యేకంగా 'యోగా స్ట్రీట్'గా నామకరణం చేసి వివిధ శాఖల ఆధ్వర్యంలో రోజూ యోగా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. నెల రోజుల యోగాంధ్ర కార్యక్రమం అనంతరం సైతం ప్రజలు యోగా ను వదిలిపెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యంగా ఉండటం ఆర్థికంగా సైతం ప్రయోజనకర మన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, రెవిన్యూ అధికారి మురళి పాల్గొన్నారు.

మాచర్ల రూరల్‌లో

శనివారం ఉదయం 5 గంటలకు మాచర్ల పట్టణంలోని ఎస్‌కెబిఆర్ క్రీడా మైదానంలో జరిగే యోగా డేని నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 11వ ప్రపంచ యోగా దినోత్సవాన్ని ప్రజలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 5 గంటలకు ఎస్‌కెబిఆర్ ప్రభుత్వ కాలేజి గ్రౌండ్ లో వేలాది మందితో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగా సమ్మేళనానికి ప్రజలు తరలి రావాలన్నారు. ఈ సమ్మేళనంలో ప్రజలు, పురప్రముఖులు, అధికారులు, కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై యోగా విశిష్టతను అవగాహన పెంచు కోవాలని కోరారు.

కారంపూడిలో

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శనివారం జరిగే యోగాంధ్ర, ప్రతి నెల మూడవ శనివారం జరిగే స్వచ్ఛ్ ఆంధ్ర -స్వర్ణాంధ్ర, కార్యక్రమాలపై సచివాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అన్ని గ్రామాలు కలిపి110 లొకేషన్స్ ని గుర్తించి, ఒక్కొక్క ఉద్యోగిని ఇన్చార్జిగా నియమించడం జరిగిందని, సదరు ఉద్యోగి ఆధ్వర్యంలో పైన తెలిపిన ప్రాంతాలలో ఉదయం ఆరు గంటల 30 నిమిషాలకు యోగాంధ్ర కార్యక్రమం ప్రారంభించాలని తెలిపారు కార్యక్రమంలో సిహెచ్‌ఓ మల్లయ్య, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

న్యాయవాది కెనడికి ఎమ్మెల్యే, న్యాయమూర్తుల నివాళి

ప్రజాశక్తి - మాచర్ల

గుండెపోటుతో గురువారం మరణించిన సీనియర్ న్యాయ వాది కుంటి కెనడి పార్థీవ దేహన్ని మాచర్ల ఎంఎల్ఎ జూలకంటి బ్రహ్మానందరెడ్డి, న్యాయమూర్తులు శ్రీనివాసకళ్యాణ్, అదనపు సివిల్ జడ్జి పి ప్రశాంత్, మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్, న్యాయవాదులు సందర్శించి నివాళులు అర్పించారు. కెనడి పార్థీవ దేహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మనోధైర్యంతో ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్మిక లోకానికి ఆయన చేసిన సేవలను కోనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్, సీనియర్ న్యాయవాదులు కేళం శ్రీనివాసరావు, కె .రంగారావు, గట్ల సత్యనారాయణరెడ్డి, సిహెచ్ నాగిరెడ్డి, కుర్రి సాయి మార్కొండ రెడ్డి, శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వరరావు, వై క్రిష్ణమూర్తి, ప్రభుదాసు, జి ప్రసాదు, కోర్టు అధికారులు, సిబ్బంది, కార్మిక సంఘ నాయకులు అబ్రహాంలింకన్ పాల్గొన్నారు.



కమిషనర్‌ను సన్మానిస్తున్న వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

యోగాతో మంచి ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

యోగాతో మంచి ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా మాచర్ల మున్సిపల్ ఆఫీసులో మే 21వ తేదీ నుండి జూన్ 20వ తేదీ వరకు ఉదయం 6:30 నుండి 7 గంటల 30 నిమిషాల వరకు మున్సిపల్ కమిషనర్ డి. వేణు బాబు ఆధ్వర్యంలో యోగ శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వేణుబాబు మాట్లాడుతూ యోగా క్రమం తప్పకుండా చేయటం వలన శరీరానికి ఉల్లాసం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం నెల రోజులుగా శిక్షణ ఇస్తున్న గురువులు స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెట్టుగోవిందరెడ్డి, హేమలతను మాచర్ల మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు ఆధ్వర్యంలో సన్మానించారు.

ప్రజాస్వామ్య రాజకీయాలకు జగన్ అనర్హుడు

యాగంటి మల్లికార్జున రావు

ప్రజాశక్తి - మాచర్ల

తలలు నరుకుతామని ఓ వ్యక్తి ప్రదర్శించిన ప్లకార్డుకు వత్తాసు పలుకుతున్న జగన్ రెడ్డి ప్రజాస్వామ్య రాజకీయాలకు అనర్హుడని మాజీ మార్కెట్ చైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి 2029 ఎన్నికల తర్వాత నరికి చంపుతామంటూ ప్రదర్శించిన ప్లకార్డులో తప్పు లేదంటూ జగన్ మాట్లాడిన తీరును రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. జగన్ ధోరణి రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందన్నారు. గత ఐదేళ్ళ పాలనలో అధికార అండతో వైసీపి శ్రేణులు బూతులతో రెచ్చిపోయారని, అందుకే ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. ఇప్పటికైనా జగన్ తన ధోరణి మార్చుకోవాలని లేకపోతే గత ఎన్నికల్లో వచ్చిన 11సీట్లు కూడా ఆ సారి రావని హెచ్చరించారు.

ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ఫిర్యాదులపై జెసి విచారణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు కోసం ప్రవేశపెట్టిన డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేయాలని పేదలకు సమర్థవంతంగా సేవలు అందేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ డిసిప్లినరి కమిటి సమావేశం జరిగింది. సమావేశంలో ఫిర్యాదులను కమిటి సభ్యులు విచారణ చేశారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పేషెంట్లకు బిల్లులు లేకుండా నగదు రహిత వైద్యం అందిచేలా ఆసుపత్రి యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి, డిసిహెచ్. డాక్టర్ ఎం. ప్రసూనా, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డికి పెరుగుతోన్న ప్రజాభిమానం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్ని ఆంక్షలు విధించినా లెక్కచేయక ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి జగన్మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేశారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. నరసరావుపేట పట్టణం గుంటూరు రోడ్డులోని వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోపిరెడ్డి మాట్లాడుతూ పోలీసులు ప్రతి జగన్మోహన్ రెడ్డి పర్యటించే ప్రతి మార్గంలో అడ్డంకులు సృష్టించినా జగన్మోహన్ రెడ్డిని చూడాలని ఆశగా వచ్చారన్నారు. సింగయ్య అనే వ్యక్తి ప్రైవేట్ కాన్వాయ్ తగిలి, యువకుడు జయవర్ధన్ రెడ్డి గుండెపోటుతో మృతి చెందారని తెలిపారు. సింగయ్య, జయవర్ధన్ రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. గతంలో గోదావరి పుష్కరాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రచార ఆర్భాటంతో 29 మంది, 2022 ప్రచారంలో 8 మంది, 2023లో చీరల పంపిణీ చేసే సమయంలో ముగ్గురు మహిళలు, తిరుపతి వైకుంఠ ఏకాదశి టిక్కెట్ల కౌంటర్ వద్ద ఆరుగురు, సింహాచలంలో గోడ కూలి ఏడుగురు చనిపోయారని వారి కుటుంబాలకు ఎటువంటి న్యాయం చేశారని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి నుండి బయటకు వస్తుంటే లభిస్తున్న ప్రజాధారణ చూసి కూటమి ప్రభుత్వం భయపడుతూ విఫలం చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత ఏడాదిలోనే మొదలైందన్నారు. అక్రమ అరెస్ట్‌లపై న్యాయ పోరాటం చేస్తామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

పని గంటల విధానాన్ని ఉపసంహరించుకోవాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఏఐటియుసి నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో కార్మికుల 10 గంటల పని విధాన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణం వినుకొండ రోడ్డు ఆర్టీసి బస్టాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఏఐటియుసి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ ఏఐటియుసి రాష్ట్ర కమిటి పిలుపు మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని లేబర్ కోడ్లు రద్దు చేసి రాత్రి సమయంలో మహిళలతో పని చేయించాలనే ఆలోచన మాను కోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ కార్మికులకు వర్తింప జేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను కట్టు బానిసలుగా చేసే విధానానికి స్వస్తి పలకాలని 10 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకుని మహిళలకు పూర్తి భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షులు ఉప్పలపాటి రంగయ్య, సిపిఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణ రాజు, నాయకులు జానీ, వెంకటే శ్వర్లు, అశోక్‌రెడ్డి, సుబ్బారావు, నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజా వేదికకు 118 అర్జీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల నుంచి 118 అర్జీలను ఆయన అందుకున్నారు. ఇంటి స్థలాలు, పెన్షన్ ఇతర పలు సమస్యలను పరిష్కరించాలని అర్జీలు వచ్చాయన్నారు. నియోజక వర్గంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను అందజేస్తానని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కపలవాయి విజయ కుమార్, సింహాద్రి యాదవ్, రంగిశెట్టి రామకష్ణ, గట్టుపల్లి సత్యనారాయణ, తాళ్లూరి సత్యనారాయణ, వనమా సాంబశివరావు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐగా అశోక్

ప్రజాశక్తి - విజయపురిసౌత్



నాగార్జున సాగర్, విజయపురిసౌత్ ఎస్ఐగా డి.అశోక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా అశోక్ విధులు నిర్వహించి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, జూదం, అక్రమ రేషన్ వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్ఐలు సోమయ్య, రామకృష్ణరెడ్డి, సింగయ్య పాల్గొన్నారు.

నేడు పిడుగురాళ్లలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

డిపార్ట్మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పిడుగురాళ్ళ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నేడు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తునట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజిరావు మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వి కృష్ణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. జాబ్ మేళాలో సుమారు 10 కంపెనీలు పాల్గొంటున్నాయి. గోదావరి ఆంధ్ర కొఆపరేటివ్ బ్యాంక్, మాస్టర్ మైండ్స్,టాటా జాస్పర్, హెటిరో డ్రగ్స్,దివి ఆగ్రోస్, అల్ట్రుఇన్స్త, జస్ట్ డయిల్,వరుణ్ మెటర్స్,మెడ్ ప్లస్ ఫార్మసీ కియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు హాజరవుతున్నాయని తెలియజేశారు. జాబ్ మేళాకు హాజరయ్యే వారు బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించే జాబ్‌మేళాకు హాజరు కావాలని తెలిపారు.






దుగ్గిరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది, చేబ్రోలులో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సిబ్బంది, తాడేపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సితారామయ్య

ప్రజలకు - ప్రభుత్వానికి మధ్య వారధి రెవెన్యూ శాఖ

ప్రజాశక్తి - దుగ్గిరాల

రెవెన్యూ శాఖ ప్రతి ఒక్కరి జీవితంలో మమేకమై ఉండదని, ప్రజలకు - ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తుందని తహశీల్దార్ ఐ.సునీత అన్నారు. రెవెన్యూ డే సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ముందంజలో ఉండి మండలం రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలవాలని రెవెన్యూ సిబ్బందిని కోరారు. గ్రామానికి చెందిన విశ్రాంత తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ షేక్ జబీన్, టిడిపి మండల అధ్యక్షులు కేశంనేని శ్రీఅనిత, పాటిబండ్ల కృష్ణప్రసాద్, వెనిగళ్ళ కృష్ణప్రసాద్, యేళ్ల జయలక్ష్మి, పసుపులేటి శ్రీనివాసరావు, పసుపులేటి సాయి, చైతన్య ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద 'రెవెన్యూ డే' వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో రెవెన్యూ శాఖకు సంబంధించిన డాక్యుమెంట్లు, రికార్డులను, ప్రజలు మరియు రైతులు పరిశీలించుకొనేందుకు, అవగాహన పొందేందుకు ప్రదర్శించి వీలు కల్పించారు. తహసీల్దార్ కె.శ్రీనివాసశర్మ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి రెవెన్యూ శాఖపరమైన సేవలతో సంబంధం ఉంటుందన్నారు. రిటైర్డ్ అయిన రెవెన్యూ ఉద్యోగులను, రైతులను సన్మానించారు. ఉత్తమ సేవలందించిన రెవెన్యూ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ బి.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు, తెదేపా మండల అధ్యక్షులు మైలా వెంకటరామరాజు, ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మినారాయణ, రైతు సంఘం నాయకులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి



తహశీల్దార్ దినేష్ రాఘువేంద్ర

స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రభుత్వ పాలనలో రెవెన్యూ శాఖ సామాన్య ప్రజలకు చేరువలో ఉంటూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించిందని మంగళగిరి తహశీల్దార్ దినేష్ రాఘువేంద్ర అన్నారు. ఐదేళ్లకొకసారి జరిగే ఎన్నికల ప్రక్రియ, అనుకోని విపత్తులు ఏర్పడినప్పుడు రెవెన్యూ శాఖ కీలక పాత్ర వహిస్తుందని ఆయన అన్నారు. రెవెన్యూ డే సందర్భంగా అధికారులు, కార్యాలయ సిబ్బందితో తహశీల్దార్ డి.రాఘువేంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వార్డులోని ప్రజలకు అత్యుత్తమ సేవలు పనితీరు కనబరిచిన సచివాలయ సిబ్బందికి ప్రశంస పత్రాలు అందించారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కీలకమైన అన్ని శాఖలలో రెవెన్యూ శాఖ తల్లి లాంటిదని తహశీల్దార్ డి.సీతారామయ్య అన్నారు. శుక్రవారం రెవెన్యూ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తహశీల్దార్ సీతారామయ్య మాట్లాడుతూ మండల పరిధిలో రెవెన్యూకు సంబంధించి తమ శక్తి వంచన లేకుండా ప్రజలకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మండల ఉపతాహశీల్దార్ ఎస్.ఎ.రిజ్వాన్, ఆర్ఐ కొమ్మ వేదాంతరావు, టిడిపి మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కృష్ణ, టిడిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, టిడిపి తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, జనసేన తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, ఇప్పటం గ్రామ మాజీ సర్పంచ్ శంకర శెట్టి పిచ్చయ్య, టిడిపి నాయకులు కంచర్ల రంగారావు, జముడు గాని రత్తయ్య , కేలి వెంకటేశ్వరరావు, పఠాన్ జానీ ఖాన్, హిట్టా పెంచలయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -మేడికొండూరు

ప్రభుత్వ రంగ వ్యవస్థలలో రెవిన్యూ వ్యవస్థ ఎంతో బాధ్యతాయుతమైనదని తాడికొండ నియోజకవర్గ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. మేడికొండూరు తాసిల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ దినోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఎమ్మెలే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జనన ధ్రువీకరణ నుండి, మరణ ధ్రువీకరణ పత్రాల వరకు రెవెన్యూ కార్యాలయాలతోనే ముడిపడి ఉంటుందని అన్నారు. రెవెన్యూ దినోత్సవంలో భాగంగా పదవీ విరమణ చేసిన తహసిల్దార్ పద్మనాభుడు, మల్లికార్జునరావులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. అనంతరం రెవెన్యూ వ్యవస్థలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఎమ్మెల్యే ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడికొండూరు తహశీల్దార్ హరిబాబు, మండల అభివృద్ధి అధికారి డేవిడ్ ప్రభాకర్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మల్లిపెద్ది రమేష్, పాములపాటి శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు అందజేస్తున్న అధికారులు

రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు సబ్సిడీపై వరి విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి రమణకుమార్ మాట్లాడుతూ పెదకాకాని మండలం లో సబ్సిడీ పై వరి విత్తనాలు పంపిణీ చేయటం జరిగిందని, వరి విత్తనాల రకం. బీపీటీ -5204 ధర 1కేజీ -43 రూపాయలు దానిలో కేజీకి 5 రూపాయలు సబ్సిడీ పోతుందని తెలిపారు. కావలసిన రైతులు పట్టా బుక్, ఆధార్ కార్డు తీసుకోని రైతు సేవా కేంద్రాలలో విత్తనాలు తీసుకోగలరని సూచించారు. ఈ కార్యక్రమంలో సి. హెచ్ వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 181 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - మేడికొండూరు

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా నియోజకవర్గ స్థాయి జాబ్ మేళాను ఏర్పాటు చేయడం జరిగిందని తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. మండలంలోని విశదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్నారై అయితే ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం తాడికొండ నియోజకవర్గ స్థాయి జాబ్ మేళా జరిగింది. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ జాబ్ మేళాలో 30 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ హాజరయ్యారు. 181 మందికి ఉపాధి అవకాశాలు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పిడి విజయలక్ష్మి, ఎన్నారై సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు, జిల్లా స్టీల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారి సంజీవరావు, తాడికొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పలువురు నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పుట్టిరోజు సందర్భంగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - మంగళగిరి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని లక్ష్మీ ఆరుష్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్, మెడ్ స్టార్ హాస్పిటల్స్ వైద్యుల సహకారంతో మంగళగిరి పట్టణం పాత బస్టాండ్ సెంటర్ సమీపంలోని వైష్ణవి కళ్యాణ మండపంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 780 మందికి వైద్య సేవలు అందజేశారు. శిబిరంలో ఇంటర్నెషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బి శీహరి, మెదడు, వెన్నుపూస, నరములు, కండరాలు వైద్య నిపుణులు డాక్టర్ బి.హేమేశ్వరరావు, పల్మనాలజిస్ట్ డాక్టర్ టి.సందీప్, జాయింట్ రిప్లేస్ మెంట్ సర్జన్ డాక్టర్ సి.హెచ్.ప్రశాంత్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎం.నీలిమ, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ బి.గౌతంకృష్ణ, రెడియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ బి.రాకేష్ వైద్య సేవలు అందించారు. రోగులకు అవసరమైన 2డి ఎకో, ఈసీజీ, షుగర్, బీపీ, న్యూరో పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి



వైద్య శిబిరంలో పరిక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, లక్ష్మి ఆరుష్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ బి.విజయ చైతన్య, మేనేజింగ్ డైరెక్టర్ పరుచూరి సాయికుమార్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, ఎంపీపీ షేక్ జబీనా, మంగళగిరి పట్టణ పార్టీ అధ్యక్షులు పడవల మహేష్, మంగళగిరి రూరల్ పార్టీ అధ్యక్షులు పల్లబోతులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్




మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రవికుమార్, వేదికపై అతిథులు

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి భాధ్యత అని గుంటూరు అడిషనల్ ఎస్పీ ఏటీవీ. రవికుమార్ అన్నారు. శుక్రవారం కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ నేరాలు జరిగిన తరువాత కేసులు కట్టడం కంటే నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని తెలిపారు. ఈ నెల 26న మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయా కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. అందులో బాగంగా కెఎల్ వర్శిటీలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. మంగళగిరి నార్త్ డీఎస్పీ సీహెచ్.మురళీకృష్ణ, వర్శిటీ రాజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడారు. మంగళగిరి నార్త్ జోన్ డిఎస్పీ సిహెచ్. మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు, కెఎల్ వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్, ఎన్‌సిసి లెఫ్టినెంట్ వి.మౌనిక పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మలేరియా నివారణకు విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి భార్గవ్ పేటలోని ఎస్ఎస్ టాలెంట్ స్కూల్ విద్యార్థులతో ఫ్రైడే డ్రైడే, మలేరియా మహోత్సవాల సందర్భంగా శుక్రవారం మంగళగిరి మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎ.శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్ సాగర్, సైదులు, హెల్త్ అసిస్టెంట్స్ కడియం శ్రీనివాసరావు, ఎస్ టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ పార్వతి, మంగళగిరి మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

కెఎల్‌యులో అగ్రిమాపక సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ పరిధిలోని నాగ్‌పూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్ (ఎన్ఎఫ్ఎస్ సి) నుండి సబ్-ఆఫీసర్ ట్రైనీల కోసం సమగ్ర ఆచరణాత్మక శిక్షణా కార్యక్రమాన్ని హ్యాండ్స్-ఆన్ ఫైర్ సేఫ్టీ శిక్షణ పేరుతో వడ్డేశ్వరంలోని కెఎల్ యూనివర్శిటీలో విజయవంతంగా నిర్వహించినట్లు కెఎల్‌యు ప్లానింగ్ అండ్ డెవలెప్ మెంట్ అసోసియేట్ డీన్ కె.బ్రహ్మాచారి శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భారతదేశంలోని ఆరు వేర్వేరు రాష్ట్రాల నుండి 30 మంది సబ్-ఆఫీసర్ ట్రైనీలను ఒకచోట చేర్చి వారికి అధునాతన అగ్నిమాపక భద్రతా వ్యవస్థలు, అత్యవసర ప్రతిస్పందన ప్రోటోకాల్‌లు, సంస్థాగత సంసిద్ధత విధానాలకు విలువైన ఆచరణాత్మక అనుభవాల గురించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెఎల్‌యు తరుపున వైస్ చాన్సులర్ డాక్టర్ ఎ.విఎస్.ప్రసాద్, డీన్, ప్లానింగ్, డెవలప్‌మెంట్ విభాగం డీన్ డాక్టర్ వి. రాజేష్‌లు భాధ్యత వహించగా, సీనియర్ డైరెక్టర్ కమాండర్ జి.గురుమూర్తి, ప్లానింగ్, డెవలెప్ మెంట్ అసోసియేట్ డీన్‌లు డి. శేషిరెడ్డి, కె.జె. బ్రహ్మాచారి, వై. మౌళి చంద్ కార్యక్రమంలో పాల్గొని అగ్నిమాపక సిబ్బందికి తమ అనుభవాలను అందించారు.

ప్రజాసేవలో రెవెన్యూ సేవలు విస్తృతం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రెవెన్యూ దినోత్సవ వేడుకలను తెనాలి తాశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన పలువురు ఉద్యోగులను తాశీల్దార్ కె.వి గోపాలకృష్ణ సన్మానించారు. 1978 జూన్ 20 నుంచి నేటికీ ప్రజాసేవలో రెవెన్యూ శాఖ విస్తఅత సేవలు అందించినట్లు తాశీల్దార్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రెవెన్యూ శాఖ ముందుంటుందన్నారు.



కష్టమర్లకు వాహనాన్ని అందచేస్తున్న టివిఎస్ సంస్థ యాజమాన్యం

టివిఎస్ జూపిటర్ సరికొత్త వేరియంట్ విడుదల

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పయినీర్ టివిఎస్ షోరూంలో శుక్రవారం టూవీలర్ తయారీ సంస్థ టివిఎస్ వారి 125 సిసి సెగ్మెంట్‌లో సరికొత్త వేరియంట్ జూపిటర్ -125(ఎస్ఎక్స్‌సి) డ్యుయల్‌టోన్ వాహనాన్ని మెకానిక్ సంఘం ప్రెసిడెంట్ షేక్.గౌస్, సంఘ నాయకులు షేక్.ఆసిఫ్ అలీ చేతులమీదుగా ఆవిష్కరించారు. ముందుగా వెహికిల్ బుకింగ్ చేసుకున్న 10 మంది కష్టమర్లకు నూతన వాహనాలు డెలివరీ ఇచ్చారు. కార్యక్రమంలో పయినీర్ టివిఎస్ సంస్థ యాజమాన్యం సిఇఒ రాఘువేంద్ర, ప్రైవేటు మెకానిక్‌లు, కష్టమర్లు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో అసోసియేషన్ ప్రతినిధులు

పవర్ లిఫ్టింగ్ పోటీలకు 12 మంది ఎంపిక

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనెల 22 నుండి 30వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని ధావన్‌గిరి పట్టణంలో జరిగే నేషనల్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ (మెన్ & ఉమెన్) పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ టీమ్‌లో గుంటూరు జిల్లాకు చెందిన 12 మంది పవర్ లిఫ్టర్లు ఎంపిక య్యారని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని సంయుక్తంగా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళ సబ్ జూనియర్ టీంలో పి.అంజలి, బి.లిఖిత. ఈ.ఎల్.వినయ్ శ్రీ, పురుషుల సబ్ జూనియర్ టీంలో టి.మణిచంద్, ఎస్.మునీశ్వరం, సీనియర్ మహిళ విభాగంలో బి.చంద్రిక, మహిళ జూనియర్ విభాగంలో ఎం.షానూన్, షేక్ సాదియా ఆల్మాస్, షేక్ షబీనా, ఎన్ జ్ఞాన దివ్య,పురుషుల జూనియర్ టీంలో పి.జమీర్ ఖాన్, డి. ఫృధ్వి కుమార్ ఎంపికైనట్లు తెలిపారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ ఉమాశంకర్‌రెడ్డి

కళ్లంలో యోగా సాధన

ప్రజాశక్తి - గుంటూరు

చౌడవరంలోని కళ్ళం ఇంజినీరింగ్ కాలేజిలో అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు యోగాసనాలు సాధన చేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి మాట్లాడుతూ యోగ సాధన చేయటం వల్ల అనేక లాభాలున్నాయని, శారీరకంగా, మానసికంగా దృఢంగా మారతామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎస్.బి.రెడ్డి మాట్లాడుతూ యోగాభ్యాసం ద్వారా ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు ఎలా పరిష్కరించాలనే సామర్థ్యం, ధైర్యం పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈషా ఫౌండేషన్ గుంటూరు సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల యోగా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సూర్య నారాయణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసులు పర్యవేక్షించగా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



షట్టర్ల ఏర్పాను పరిశీలిస్తున్న అధికారులు

వారం రోజుల్లో తాగునీరు విడుదల

ప్రజాశక్తి - దుగ్గిరాల

డెల్టా కాల్వల ద్వారా చెరువులకు మరో వారంరోజుల్లో తాగునీరు విడుదల చేయనున్న దృష్ట్యా తూములకు షట్టర్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టినట్లు దుగ్గిరాల సెంట్రల్ సబ్ డివిజన్ జల వనరుల శాఖ డిఇ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పాత లాకుల వద్ద కొత్త షట్టర్లు బిగింపును ఆయన శుక్రవారం పరిశీలించారు. దుగ్గిరాల సెక్షన్‌లో వివిధ కాల్వలకు 13 షట్టర్లను ఏర్పాటు చేస్తున్నట్టు డిఇ తెలిపారు. తుంగభద్ర కాల్వ, నిజాంపట్నం తూర్పు పశ్చిమ కాల్వ, రేపల్లె కాల్వ, దుగ్గిరాల రెగ్యులేటర్, ఈమని, అత్తోట బ్రాంచ్ కాల్వలకు కొత్త షట్టర్లను తాడేపల్లి జల వనరుల శాఖ వర్క్ షాప్ నుండి వచ్చిన సిబ్బంది ఏర్పాటు చేస్తున్నారు. ఎఇ కె.లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

23న కలెక్టరేట్ల వద్ద అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి - గుంటూరు

పెరుగుతున్న ధరల ప్రకారం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని జూన్ 23న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహి స్తున్నట్లు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తెలిపారు. ఈ ధర్నాలో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం పాతగుంటూరు సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన అంగన్వాడీల జిల్లా విస్తృత సమావేశం జరిగింది. సమావేశంలో ఆమె మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అంగన్వాడీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించక పోగా యాప్‌ల పేరుతో పనిభారం పెంచుతుందన్నారు. పనిచేయని సెల్‌ఫోన్ల ద్వారా ఆన్‌లైన్ వర్క్ ఎలా చేయాలని ప్రశ్నించారు. అంగన్వాడీలు ప్రభుత్వ ఉద్యోగులు అనే సాకుతో తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయట్లేదన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా అయినా గుర్తించి, కనీస వేతనాలు అమలు చేయాలని, అప్పటి దాకా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పని గంటలను తగ్గించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హెల్పర్స్ ప్రమోషన్ విధివిధానాలు రూపొందించాలని కోరారు. సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎవియన్ కుమారి అధ్యక్షత వహించగా, జిల్లా ఉపాధ్యక్షురాలు సుకన్య, పద్మజా, ప్రేమలత, జిల్లా సహాయ కార్యదర్శి హేమలత, రత్న మంజుల తదితరులు పాల్గొన్నారు.

27 నుండి ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభలు



జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - గుంటూరు

భారతి విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 18వ అఖిలభారత మహాసభలు కేరళ రాష్ట్రం, కోజికోడ్ జిల్లాలో జూన్ 27 నుంచి 30 వరకూ నిర్వహిస్తున్న నేపథ్యంలో గుంటూరు నగరంలోని పలు కాలేజిల్లో ఎస్ఎఫ్ఐ జెండాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యారంగంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, వాటి వల్ల విద్యార్థులకు కలుగుతున్న నష్టాలపై చర్చించి, పరిష్కార మార్గాలపై తీర్మానాలు చేస్తారన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిదానం (ఎన్ఇపి) 2020 వల్ల విద్య ప్రైవేటీకరణ, కాషాయికరణ పెరుగుతుందన్నారు. పేద విద్యార్థులకు విద్యను మరింత దూరం చేసే విధంగా ఎన్ఇపి ఉందన్నారు. అఖిల భారత మహాసభల్లో ఎన్ఇపిని తిప్పికొట్టేందుకు సమగ్రంగా చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ కాలేజ్ వద్ద ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద కాలేజ్ కమిటీ సెక్రెటరీ సౌమ్య జెండా ఆవిష్కరించారు. అలాగే ఏసీ కాలేజి వద్ద ఎస్ఎఫ్ఐ కార్యదర్శి షేక్ సుభాని, ప్రైవేటు కళాశాల వద్ద నగర ఉపాధ్యక్షులు షంషీర్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు జాన్, నగర సహాయ కార్యదర్శి రాజ్, నగర కమిటీ సభ్యులు ఇర్ఫాన్, నాగప్రవీణ్, సుభాష్, సైదాబీ తదితర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పనుల పురోగతి ఎప్పటికప్పుడు తెలియజేయాలి

ప్రజాశక్తి - గుంటూరు

జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన పనుల పురోగతిని ఎప్పటికప్పుడు అధికారులు తెలియజేయాలని, ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టీనా సూచించారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి జెడ్పీ సీఈవో జ్యోతిబసు అధ్యక్షత వహించగా, చైర్‌పర్సన్ మాట్లాడుతూ జరుగుతున్న పనుల వివరాలను ప్రతినెల మొదటి వారంలో జిల్లా పరిషత్ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. రద్దు చేసిన, చేపట్టడానికి వీలు లేని పనులు వివరాలను కూడా జిల్లా పరిషత్‌లోని సంబంధిత శాఖకు తెలియ జేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయ తీరాజ్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీ కార్యాలయ పనుల పరిశీలన

జెడ్పీ కార్యాలయంలో జరుగుతున్న మరమ్మతు పనులను శుక్రవారం చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా పరిశీలించారు. 60 ఏళ్ల క్రితం జెడ్పీ కార్యాలయం నిర్మించారు. దీంతో కార్యాలయంలో చాలా చోట్ల స్లాబుల పెచ్చులు ఊడి పగుళ్లు ఇచ్చి సిబ్బందికి ఇబ్బందికరంగా మారడంతో మరమ్మత్తుల నిమిత్తం రూ.30 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న హెనీ క్రిస్టీనా

పరిశోధనలపై హిందూ ఫార్మసీలో సదస్సు

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో పరిశోధనలు, అభివృద్ధి అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సెమినార్‌లో ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఇ శాఖ ప్రిన్సిపాల్ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ ఎం.శ్రీనివాస శంకరప్రసాద్ మాట్లాడుతూ ఫార్మసీ కళాశాల అధ్యాపకులు ఔషధ రంగంలో పరిశోధనలు చేసి నూతన ఔషధాలను కనుగొనాలన్నారు. విద్యార్థులను కూడా పరిశోధనలు చేసే విధంగా తగిన శిక్షణను కల్పించాలని అన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఇంక్యుబేషన్ సెంటర్, స్టార్టప్ పరిశ్రమలకు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం చేస్తున్నారని వాటి విధివిధానాలను గురించి తెలిపారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ పాముకాటుకు, కాళ్ళతీపులకు మనము వాడే మూలిక ఔషధాలలోని క్రియాశీల రసాయనిక పదార్ధాల వివరాలను తెలుసుకొని పేటెంట్ పొందవచ్చునని అన్నారు. కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణ మూర్తి మాట్లాడుతూ మధుమేహ చికిత్సకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఔషధాల వివరాలను తెలియచేశారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం , అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస శంకర్‌ప్రసాద్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రేపు జెఎల్‌ఎం రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - గుంటూరు

నెల్లూరులో ఆదివారం జరగనున్న జేఎల్‌ఎం గ్రేడ్-2ల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.నాగబ్రహ్మాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకరలు సమావేశంలో జేఎల్‌ఎం గ్రేడ్ 2ల సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ జయంతి నాడు 2019లో గ్రామ, వార్డు సచివాలయాల పోస్టుల్లో భాగంగా జేఎల్‌ఎం గ్రేడ్2లను నియామకం చేశారని, కానీ వారికి అప్పటి నుండి విద్యుత్‌శాఖలోని ఏపీ ఎస్వీబీ రూల్స్‌ను, విధి విధానాలను వర్తింప చేయట్లేదన్నారు. జిల్లా అధ్యక్షులు వి.రాంప్రభాకర్ మాట్లాడుతూ జేఎల్‌ఎం గ్రేడ్-2లకు స్థానచలనం కోసం కూడా అవకాశం కల్పించలేదన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బి.లక్ష్మణరావు, టౌన్ -1 అధ్యక్షులు జె.చెన్నకేశవులు, సిఐటియు జిల్లా కోశాధికారి ఎం.సాంబశివరావు, కిరణ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

యోగతో ఏకాగ్రత

ప్రజాశక్తి - గుంటూరు



భాష్యం రామకృష్ణ

యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు, ఏకాగ్రత అలవడుతుందని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో యోగోత్సవ్ పేరిట నిర్వహిస్తున్న యోగా కార్యక్రమం శుక్రవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు యోగాసనాల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఏకాగ్రత పెంపొందించుకుని చదువులో సైతం చురుకుగా ఉంటారన్నారు. ప్రముఖ యోగా గురువు బి.మల్లిఖార్జునరావు, భాష్యం విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ పాల్గొన్నారు.

లాసెట్‌లో సూర్యతేజకు 3వ ర్యాంకు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సూర్య తేజ

ఏపీ-లాసెట్ ఫలితాల్లో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణానికి చెందిన బత్తుల సూర్యతేజ రాష్ట్రస్థాయి ఓపెన్ కేటగిరీలో 3వ ర్యాంక్ సాధించారు. బత్తుల నరసింహం, సరస్వతి దంపతుల కుమారుడైన సూర్యతేజ వికలాంగుడై నప్పటికీ 3వ ర్యాంకు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలనే లక్ష్యంగా పెట్టుకొని పట్టుదల, స్వయంకృషితో కష్టపడి చదివి ర్యాంకును సాధించడం ద్వారా ఎంతోమందికి ఆదర్శంగా నిలిచాడని పలువురు అభినందించారు.